నేటి నుంచి నమస్తే ప్రాపర్టీ షో

ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సంస్థల స్టాళ్లు

- రెండు రోజుల పాటు ప్రదర్శన
- జిల్లా కేంద్రంలోని వేణుమాల్‌లో ఏర్పాటు
- ఒకే వేదికపైకి రియల్ ఎస్టేట్ సంస్థలు

నమస్తే తెలంగాణ Telangana Today

ఖలీల్‌వాడి, మార్చి 7 : రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఇందూరు నగరంలో అధునాతన భవనాలు, విల్లాలు, అపార్టుమెంట్లు, ఇండ్ల నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. ప్రధాన నగరాలకు దీటుగా ప్రగతి సాధిస్తున్నది. మెరుగైన జీవన ప్రమాణాల నగరంగా ఖ్యాతి గడించిన ఇందూరులో నివాసం ఉండడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అలాంటి వారి కోసం ఇక్కడ ఎన్నో రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ సంస్థలు వెలిశాయి. వారి అభిరుచులకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న వేణుమాల్ (హోటల్ నిఖిల్ సాయి)లో నమస్తే తెలంగాణ , తెలంగాణ టుడే ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ప్రాపర్టీ షో నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్, నిర్మాణ సంస్థలు ఒకే వేదికపై కొలువుదీరనున్నాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు జిల్లావాసులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఒకే వేదికపై ప్రముఖ కంపెనీలు

మెయిన్ స్పాన్సర్ వాసవి గ్రూప్స్, కో –స్పాన్సర్ శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్(ఎస్‌వీసీ), మకుట బిల్డర్స్ (క్రాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్), అసోసియేషన్ విత్ : శ్రీ అశోకా బిల్డర్స్ అండ్ డెవలపర్స్, ఐశ్వర్యం హోమ్స్, రాయల్ ఓక్ నిజామాబాద్, బాలాజీ డివైన్, ఏపీడీ డెవలపర్స్, శ్రీ గోవిందసాయి బిల్డర్స్ అండ్ డెవలపర్స్, శ్రీ ఎస్ఎల్ ఎన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, అంకురమ్, భూమి స్పేస్, సన్‌యుగ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ నార్త్ క్రెస్ట్, మయూర సూపర్ లివింగ్, ఆదూరి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పాటు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటాపవర్ సోలారూఫ్, కపిల్ ప్రాపర్టీస్, టీఎంఆర్ గ్రూప్, అక్షయ ఎంటర్ ప్రైజెస్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటిచేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ జన్మదిన వేడుకలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ నగర మేయర్ దండు నీతూకిరణ్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నాయకుడు సుజిత్ సింగ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

–ఖలీల్‌వాడి, మార్చి 7

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఈ సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు.

ఎట్టకేలకు.. పోలీసు బాస్ వచ్చారు..

నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య దాదాపు ఐదారు నెలల తర్వాత పోలీస్ కమిషనర్ రాక... ఏడాదిన్నర కాలంలో సీపీగా ఐదుగురు అధికారుల బదిలీలు కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ బదిలీ.. ఆమె స్థానంలో రానున్న రాజేశ్‌చంద్ర

పోతరాజు సాయి చైతన్య, సీపీ,నిజామాబాద్

ఎం.రాజేశ్ చంద్ర ఎస్పీ,కామారెడ్డి

నిజామాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎట్టకేలకు నిజామాబాద్ జిల్లాకు పోలీసు బాస్ వచ్చారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు నూతన కమిషనర్ రానున్నారు. ఐదారు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పోతరాజు సాయి చైతన్యను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఈయన హైదరాబాద్‌లో యాంటీ నార్కొటిక్స్ బ్యూరోకు ఎస్పీగా పని చేస్తున్నారు. కల్మేశ్వర్ బదిలీ అనంతరం నిజామాబాద్ సీపీగా పూర్తి స్థాయి బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. దీంతో పోలీస్ కమిషనరేట్‌లో ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఠాణాల్లో దుస్థితి నెలకొన్నది. ఇన్‌చార్జి సీపీ ఉన్నప్పటికీ కామారెడ్డికే పరిమితం కావడంతో పర్యవేక్షణ కొరవడింది. సుదీర్ఘ కాలం ఇన్‌చార్జి సీపీగా కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మకు బాధ్యతలనుఅప్పగించగా, తాజా బదిలీల్లో ఆమెకు సైతం స్థానచలనం కల్పించింది. 2014 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సింధూ శర్మను ఇంటిలిజెన్స్ ఎస్పీగా విధులను కేటాయించింది. ఈమె స్థానంలో కామారెడ్డి ఎస్పీగా 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఎం.రాజేశ్ చంద్రను నియమించారు. ఈయన ప్రస్తుతం యాదాద్రి భువనగిరి డీసీపీగా పని చేస్తున్నారు.

ఏడాదిన్నరలో ఐదుగురు సీపీలు

నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపీఎస్ అధికారుల మార్పులు, చేర్పులు జరిగాయి. కీలకమైన నిజామాబాద్‌కు గతంలో ఐదున్నరేండ్ల పాటుగా సీపీగా కార్తికేయ పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కార్తికేయ బదిలీ కాగా ఆయన స్థానంలో సెప్టెంబర్ 1, 2023న డీఐజీ ర్యాంక్ అధికారి వి.సత్యనారాయణ వచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో రాష్ట్రమంతటా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ సమయంలోనే పలు రాజకీయ పార్టీల ఫిర్యాదుతో సరిగ్గా 40 రోజుల వ్యవధిలోనే సీపీ సత్యనారాయణను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఈయన స్థానంలో కల్మేశ్వర్ సింగెనవార్‌ను అక్టోబర్ 11న ఈసీ నియమించింది. సరిగ్గా ఏడాది కాలం పని చేసిన కల్మేశ్వర్ సింగెనవార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఒత్తిడితో ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసింది. దీంతో ఆయన స్వచ్ఛందంగా సెంట్రల్ సర్వీసులకు వెళ్లడంతో అక్టోబర్ 17న తెలంగాణ ప్రభుత్వం నుంచి రిలీవ్ అయ్యారు. నాటి నుంచి ఇన్‌చార్జీ సీపీగా సింధూ శర్మ పని చేస్తూ వచ్చారు. ఇప్పుడు తాజాగా పోతరాజు సాయి చైతన్యను సర్కారు నియమించడంతో ఏడాదిన్నర కాలంలో మొత్తంగా ఐదుగురు ఐపీఎస్ అధికారుల మార్పు జరిగినట్లైంది.

అక్రమార్కులపై చర్యలు శూన్యం..

కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ ఏడాదిన్నర కాలంలోనే బదిలీ అయ్యారు. 2023, సెప్టెంబర్ 1న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎస్పీ గా ఉన్న శ్రీనివాస్ రెడ్డి బదిలీ అయ్యారు. నెలన్నర రోజుల తర్వాత అక్టోబర్ 14న సింధూ శర్మను కామారెడ్డి ఎస్పీగా ఈసీ నియమించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలంగా సింధూ శర్మ పని చేస్తున్నారు. తాజా బదిలీల్లో ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమితులయ్యారు. సింధూ శర్మ కాలంలోనే 2023, డిసెంబర్‌లో సదాశివనగర్ మండలంలో ఆరుగురి హత్యల కేసు వెలుగు చూడగా పురోగతి సాధించారు. 2024, డిసెంబర్‌లో ఇదే మండలంలో ఎస్సై, మహిళా కానిస్టేబుల్, ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా, ఈ కేసులో పురోగతి సాధించలేదు. ఇసుక, మొరం దందాలను పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోయారు. భారీ ప్రకటనలు జారీ చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఇసుకాసురులను నిలువరించలేక పోయారు. క్షేత్ర స్థాయిలో ఆమె ఆదేశాలను పో లీసులు పట్టించుకోలేదు. ఇసుక, మొరం అక్రమార్కులతో చేతులు కలిపి పొలిటికల్ అండతో ఖాకీలు చెలరేగి పోయారు. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోకపోవడంలో సింధూ శర్మ వెనుకబడ్డారని విమర్శలు వచ్చాయి. ఆమె ఉన్నప్పుడే రెంజల్ ఠాణాలో లాకప్ డెత్ తరహా ఘటన జరగడం గమనార్హం.

హ్యాపీ ఉమెన్స్ డే

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ నేపథ్యంలో మండలకేంద్రంలోని ఓ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు 'హ్యాపీ ఉమెన్స్ డే' ఆంగ్ల అక్షర ఆకృతిలో కూర్చొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

– సిరికొండ, మార్చి 7